క్లుప్తంగా

ఆసుపత్రికి వెళ్లి.. పింఛను అందించి..



ఆస్పత్రిలో లబ్ధిదారునికి పింఛన్ అందజేస్తున్న వలంటీర్ అమరావతి

మండపేట: అనారోగ్య సమస్యలతో ఆస్పత్రిల్లో చికిత్స పొందుతున్న ఇద్దరికి వలంటీర్ సోమిరెడ్డి అమరావతి పింఛను అందజేసింది. ద్వారపూడి సచివాలయం–1లో పనిచేస్తున్న వలంటీర్ తన పరిధిలో వృద్ధాప్య పింఛనుదారులు వి.అప్పారావు, ఆకుల నూకరాజు రాజమహేంద్రవరంలోని వేర్వేరు ఆస్పత్రుల్లో చికిత్స పొందుతున్నారు. మంగళవారం వారి వద్దకు వెళ్లి పింఛను సొమ్ములు అందజేసి వచ్చారు అమరావతి.

అడిషనల్ పీఎస్‌గా తేజేశ్వరరావు



మంత్రి వేణును కలసిన తేజేశ్వరరావు

రామచంద్రపురం: రాష్ట్ర బీసీ సంక్షేమం శాఖ మంత్రి చెల్లుబోయిన శ్రీనివాస వేణుగోపాలకృష్ణ అడిషనల్ పీఏగా టి.తేజేశ్వరరావు నియమితులయ్యారు. ఈయన ఇప్పటి వరకు రామచంద్రపురం మండల తహసీల్దార్‌గా బాధ్యతలు నిర్వహించారు. అడిషనల్ పీఏగా నియమితులైన తేజేశ్వరరావు మంగళవారం మంత్రి వేణును ఆయన క్యాంపు కార్యాలయంలో మర్యాద పూర్వకంగా కలిసి కృతజ్ఞతలు తెలియజేశారు.

ఉచిత నేత్ర, దంత వైద్య పరీక్షలు



కంటి పరీక్షలు చేస్తున్న వైద్య సిబ్బంది

కె.గంగవరం: స్థానిక వ్యూహలక్ష్మి పేపర్ మిల్లు వద్ద మంగళవారం ఉచితంగా నేత్ర, దంత వైద్య పరీక్షలు నిర్వహించారు. మిల్లు మేనేజర్ బి.వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో జరిగిన ఈ శిబిరంలో కిరణ్ కంటి ఆసుపత్రికి చెందిన డాక్టర్ పి.సత్యనారాయణ, అంజన దంత వైద్యశాల వైద్యులు సలాది వీర వెంకటేష్ వారి సిబ్బంది సహాయంలో మిల్లు ఉద్యోగులతో పాటు వారి కుటుంబ సభ్యులు సుమారు 300 మందికి ఉచిత పరీక్షలు చేసి మందులు పంపిణీ చేశారు. నిర్వాహకులు వెంకటేశ్వరరావు మాట్లాడుతూ ఏటా ఉద్యోగుల శ్రేయస్సు కోసం ఎన్నో సేవా కార్యక్రమాలు చేపడుతున్నామని భవిష్యత్‌లో కూడా చేపడతామని పేర్కొన్నారు.

6న రాయవరంలో 'జగనన్నకు చెబుదాం'

రాయవరం: రాయవరంలో ఈ నెల 6న జగనన్నకు చెబుదాం కార్యక్రమం నిర్వహిస్తున్నట్టు ఎంపీడీవో కొవ్వూరి నరేంద్రరెడ్డి మంగళవారం విలేకరులకు తెలిపారు. స్థానిక మూర్తినీడి వెంకటసూర్యనారాయణమ్మ ఏసీ ఫంక్షన్ హాలులో ప్రజల నుంచి సమస్యలపై ఫిర్యాదులు స్వీకరిస్తామన్నారు. ఉదయం 9 గంటలకు ప్రారంభమయ్యే కార్యక్రమంలో జిల్లా కలెక్టరు హిమాన్షు శుక్లా ముఖ్య అతిథిగా పాల్గొంటారన్నారు.

నిరుపేద యువతి వివాహానికి ఆర్థిక సాయం

మండపేట: పట్టణంలోని 7వ వార్డుకు చెందిన రిక్షా కార్మికుని కుమార్తె సరోజనమ్మ వివాహం నిమిత్తం మున్సిపల్ మాజీ చైర్మన్ చుండ్రు శ్రీవరప్రకాష్ రూ.10 వేలు ఆర్థిక సాయం అందించారు. ఆమె తండ్రి జాన్ తీవ్ర అనారోగ్యంతో మంచం పట్టడంతో స్థానిక నాయకులు చాపల వీరబాబు, పెందుర్తి కిషోర్‌లు శ్రీవరప్రకాష్ దృష్టికి తీసుకురాగా ఆయన స్పందించి సాయం అందించారు.

వాసవీ క్లబ్ జిల్లా గవర్నర్‌కు సత్కారం



జిల్లా గవర్నర్‌గా ఎన్నికైన ప్రవీణ్‌ను సత్కరిస్తున్న అంగర వాసవి క్లబ్ సభ్యులు

కపిలేశ్వరపురం: ఇటీవల నూతనంగా ఎన్నికైన వాసవీ క్లబ్ వి215ఏ జిల్లా గవర్నర్ కాళ్ళకూరి ప్రవీణ్‌కుమార్‌ను మంగళవారం అంగర ఆర్య వైశ్య సంఘం, వాసవీ క్లబ్, వనితా క్లబ్ సభ్యులు ఘనంగా సత్కరించారు. సేవా కార్యక్రమాల్లో ముందున్న సంస్థగా పేరొందిన వాసవీ క్లబ్‌లో కీలక స్థానంలో నిలిచిన ప్రవీణ్ అంగర గ్రామానికి గర్వకారణమన్నారు. సంఘం నాయకులు దాసర చిన్నరాజు, కంకటాల నాగబాబు, గ్రంధి సురేష్, కేశవరపు ప్రశాంత్, గ్రంధి వీరకనకం పాల్గొన్నారు.

ఆరోగ్యవంతమైన సమాజ స్థాపనకు ప్రభుత్వం కృషి

- ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు
- మండపేటలో జగనన్న ఆరోగ్య సురక్ష ప్రారంభం



మండపేటలో జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరంలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు

మండపేట: ఆరోగ్యవంతమైన సమాజ స్థాపన లక్ష్యంగా ప్రభుత్వం దేశంలో ఎక్కడా లేని విధంగా జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమానికి శ్రీకారం చుట్టిందని ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు అన్నారు. ప్రతి ఇంటిలో అనారోగ్య సమస్యలున్న వారిని గుర్తించి వారికి అవసరమైన వైద్యం అందించడమే ఈ కార్యక్రమం ముఖ్య ఉద్దేశమన్నారు. స్థానిక జెడ్పీ బాలికల ఉన్నత పాఠశాలలో మంగళవారం ఏర్పాటు చేసిన జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాన్ని ఎమ్మెల్సీ తోట ప్రారంభించారు. ఈ సందర్భంగా మున్సిపల్ చైర్‌పర్సన్ పతివాడ దుర్గారాణి అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఒక ఇంటిలో ఎంత మంది ఉన్నారు. వారిలో దీర్ఘకాలిక, ఇతర అనారోగ్య సమస్యలేమైనా ఉన్నాయా అని తెలుసుకునేందుకు ఇప్పటికే వలంటీర్లు, ఆరోగ్య సిబ్బందితో సర్వే చేయించారన్నారు. అందులో గుర్తించిన వారికి సురక్ష శిబిరంలో అన్ని రకాల పరీక్షలు చేస్తారన్నారు. రోగులకు అందజేసేందుకు 142 రకాల మందులను శిబిరాల వద్ద అందుబాటులో ఉంచుతున్నారన్నారు. వైద్య నిపుణులతో వైద్య సేవలు అందించి, అవసరమైన వారికి ఆరోగ్యశ్రీ పథకం కింద కార్పొరేట్ ఆస్పత్రుల్లో మెరుగైన వైద్యాన్ని అందిస్తారన్నారు. సురక్ష శిబిరాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్సీ తోట కోరారు. చైర్‌పర్సన్ దుర్గారాణి మాట్లాడుతూ పట్టణంలోని 1వ సచివాలయం నుంచి 6వ సచివాలయం వరకు గల మొత్తం 9896 ఇళ్లను సర్వే చేసి 1570 మంది వివిధ రకాల వ్యాధులతో బాధపడుతున్న వారిని గుర్తించామన్నారు. వారికి శిబిరంలో వైద్యసేవలు, మందులు అందజేస్తామని ఆమె తెలిపారు. రైతు విభాగం రాష్ట్ర కార్యదర్శి రెడ్డి రాజుబాబు, కమిషనర్ టి.రామ్‌కుమార్, విప్ పోతంశెట్టి ప్రసాద్, కార్పొరేషన్ డైరెక్టర్లు ఆలీఖాన్‌బాబా, మీగడ శ్రీనివాసరావు, విప్ పి.వరప్రసాద్, అర్బన్ కన్వీనర్ ముమ్మిడివరపు బాపిరాజు, కౌన్సిలర్లు చిట్టూరి సతీష్, ఎర్నేని ప్రభావతి, శెట్టి కళ్యాణి, తదితరులు పాల్గొన్నారు. కేశవరంలో సురక్ష శిబిరాన్ని పార్టీ రాష్ట్ర కార్యదర్శి దూలం వెంకన్నబాబు, ఏఎంసీ చైర్మన్ సిరిపురపు శ్రీనివాసరావు, ఎంపీపీ వుండమట్ల శ్రీనివాస్ ప్రారంభించారు. గ్రామంలోని 600 మందికి పైగా పరీక్షలు చేసి మందులు అందించారు.

సురక్షతో ఆరోగ్యానికి భరోసా

కె.గంగవరం: సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ప్రవేశపెట్టిన జగనన్న ఆరోగ్య సురక్షతో ప్రజల ఆరోగ్యానికి భరోసా ఉంటుందని ఎంపీపీ పంపన నాగమణి అన్నారు. మండలంలోని సుందరపల్లి సచివాలయం వద్ద మంగళవారం జగనన్న ఆరోగ్య సురక్షలో భాగంగా వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. సమావేశంలో ఎంపీపీ నాగమణి మాట్లాడుతూ ప్రభుత్వం ఆరోగ్యానికి పెద్ద పీట వేసిందన్నారు. గ్రామీణ ప్రాంతాల్లోని ప్రజలకు మెరుగైన వైద్యం ఇంటి వద్దే అందించేందుకు ఇప్పటికే ఫ్యామిలీ డాక్టర్ విధానాన్ని ప్రవేశపెట్టిందన్నారు. దీనిలో భాగంగా ప్రతి సచివాలయం పరిధిలో వెల్‌నెస్ సెంటర్ల నిర్మాణం చేపట్టి పూర్తి స్థాయి వైద్యులను నియమించడంతో పాటు మందులను అందుబాటులో ఉంచారన్నారు. సుందరపల్లిలో నిర్వహించిన ఈ మెడికల్ క్యాంప్ వద్ద 326 మంది పరీక్షలు చేయించుకున్నారని వీరిలో మహిళలు 116, పురుషులు 211 మంది ఉన్నారన్నారు. వీరిలో 6 రోగులకు మెరుగైన వైద్యం కోసం పెద్ద ఆసుపత్రికి తరలించామని పేర్కొన్నారు. సచివాలయల మండల కన్వీనర్ తోకల శ్రీను, గ్రామ కన్వీనర్ రెడ్డి జయరాజు, సాదు, ఎంపీడీఓ ఎన్.శ్రీనివాసరావు, తహసీల్దార్ వైద్యనాథ్‌శర్మ, వైద్యులు మాణిక్యం, ఎంఈఓ–2 ఆంజనేయులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.



సుందరపల్లి శిబిరం వద్ద ప్రజలను ఉద్దేశించి మాట్లాడుతున్న ఎంపీపీ నాగమణి



అంద్రంగి సురక్షలో కరపత్రాలు పంచి రోగులకు సూచనలు అందిస్తున్న నాయకులు, వైద్యులు



కాపవరంలో జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాన్ని ప్రారంభిస్తున్న నరేన్

రామచంద్రపురం రూరల్: మండలంలోని కాపవరం సచివాలయం పరిధిలోని కాపవరం, తాడిపల్లి గ్రామ ప్రజలకు జగనన్న ఆరోగ్య సురక్ష మెడికల్ క్యాంపు మంగళవారం కాపవరంలో నిర్వహించారు. రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ మంత్రి చెల్లుబోయిన శ్రీనివాస వేణుగోపాలకృష్ణ తనయుడు నరేన్, ఏపీఐడీసీ డైరెక్టర్ వాసంశెట్టి శ్యామ్, జెడ్పీటీసీ మేర్నీడి వెంకటేశ్వరరావు, వైస్ ఎంపీపీ నరాల రాజ్యలక్ష్మి, జెడ్పీ కోఆప్షన్ సభ్యుడు తాతపూడి ప్రసన్న విజయకుమార్, మండల కోఆప్షన్ సభ్యుడు షేక్ అహ్మద్ అలీషా (బాబ్జీ), కాపవరం, తాడిపల్లి సర్పంచ్‌లు యనమదల మంగాదేవి, పిల్లి అచల రాజశ్రీ, ఎంపీటీసీ రెడ్నం సతీష్‌లు వైద్య శిబిరాన్ని ప్రారంభించారు. వెల్ల, ద్రాక్షారామ పీహెచ్‌సీల వైద్యాధికారులు శిబిరానికి హాజరైన 496 మందికి వైద్య సేవలు అందించారు. నరేన్ మాట్లాడుతూ సీఎం జగన్ ప్రభుత్వ పాలనతో పాటు ప్రభుత్వ వైద్య సేవలనూ గ్రామాల బాట పట్టించారన్నారు. ఇంటింటికీ వస్తున్న వైద్య సిబ్బంది సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.



కురకాళ్లపల్లి శిబిరంలో రోగులకు మందులు అందజేస్తున్న వైఎస్సార్ సీపీ యువనేత పృథ్వీరాజ్, ఎంపీపీ వెంకటరమణ తదితరులు

కాజులూరు: పేద, మధ్య తరగతి ప్రజలకు అనేక సంక్షేమ పథకాలు అందించడంతో పాటు వారి ఆరోగ్య పరిరక్షణకు పథకాన్ని రూపొందించి రాష్ట్రాన్ని సంపూర్ణ ఆరోగ్య ఆంధ్రప్రదేశ్‌గా తీర్చిదిద్దాలన్నదే సీఎం జగన్ లక్ష్యమని వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ గుబ్బల ఏసురాజు అన్నారు. మంగళవారం అంద్రంగిలో అధికారులు జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని నిర్వహించారు. గొల్లపాలెం పీహెచ్‌సీ వైద్యాధికారులు ఎస్ సౌజన్య, వై సుప్రియల ఆధ్వర్యంలో కాకినాడ ప్రభుత్వ ఆసుపత్రికి చెందిన పలువురు నిపుణులైన వైద్యులు పాల్గొని సుమారు 300 మంది రోగులకు వైద్య పరీక్షలు చేశారు. ఆయన మాట్లాడుతూ గ్రామాలలో ప్రజలు చిన్న, చిన్న అనారోగ్య సమస్యలను నిర్లక్ష్యం చేస్తూ క్రమేపీ దీర్ఘకాలిక సమస్యల బారిన పడుతున్నారన్నారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ వనుం వెంకటసుబ్బారావు, గ్రామ సర్పంచ్ పెదిరెడ్డి నాగసుజాత, ఎంపీటీసీ మట్టా వెంకటరమణమ్మ, మండల తహసీల్దారు బి సాయిసత్యనారాయణ, మాత మురళి, వీరభద్రరావు, సచివాలయాల సిబ్బంది, స్థానిక ప్రజాప్రతినిదులు పాల్గొన్నారు.

కురకాళ్లపల్లిలో జగనన్న ఆరోగ్య సురక్ష

రాయవరం: కురకాళ్లపల్లిలో ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాన్ని నిర్వహించారు. శిబిరాన్ని సర్పంచ్ పిల్లి శారద మంగళవారం ప్రారంభించారు. ముఖ్య అతిథులుగా వచ్చిన వైఎస్సార్ సీపీ యువనేత తోట పృథ్వీరాజ్, ఎంపీపీ నౌడు వెంకటరమణ మాట్లాడుతూ అందరూ సురక్ష కార్యక్రమాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. అనంతరం వైద్యులు కన్యాకుమారి, జీఎం చంద్రకుమారి, రాము, ఎ.దేవిరాజశ్రీ, ఎం.శ్రీనివాస్‌లు వైద్య శిబిరానికి వచ్చిన రోగులకు వైద్యసేవలందించి, మందులు అందజేశారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ పితాని ప్రసాద్, ఎంపీటీసీ వాసంశెట్టి వెంకటలక్ష్మి, మాజీ ఎంపీపీ రాయుడు సత్యనారాయణ, వైఎస్సార్ సీపీ నేతలు పిల్లి ప్రసాద్, వాసంశెట్టి సూర్యనారాయణ, పాలిక గోవిందు తదితరులు పాల్గొన్నారు.

పేదల వైద్యానికి పెద్ద పీట

- ఎమ్మెల్సీ తోట
- కపిలేశ్వరపురంలో 502 మందికి చికిత్స
- ముగ్గురికి శస్త్రచికిత్స అవసరమని గుర్తింపు

కపిలేశ్వరపురం: కపిలేశ్వరపురంలో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం నిర్వహించారు. ఎంపీడీఓ ఎం.రామకృష్ణారెడ్డి, తహసీల్దార్ కొమరం సూర్యారావు, అంగర పీహెచ్‌సీ వైద్యాధికారి పి.రత్నకుమారి ఆధ్వర్యంలో ప్రజలకు వైద్య సేవలు అందించారు. గ్రామంలో 502 మందికి పరీక్షలు చేసి మందులు అందజేశారు. చిన్నారుల సమస్యలపై 10 మందికి, గర్భకోశ వ్యాధులకు సంబంధించి 23, ఆప్తాలమిక్ 74, బీపీ, షుగరు వంటి సాధారణ వ్యాధులు 65, ఇతర వ్యాధులకు సంబంధించి 370 మందికి చికిత్సనందించారు. వారిలో 31 మందికి మెరుగైన చికిత్స అవసరమని గుర్తించారు. ఐసీడీఎస్ ఆధ్వర్యంలో అంగన్‌వాడీ కార్యకర్తలు పోషకాహార పదార్థాల ప్రదర్శనా శిబిరాన్ని నిర్వహించారు. శిబిరంలో ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు మాట్లాడుతూ జగనన్న ఆరోగ్య సురక్ష పేద ప్రజలకు ఒక వరమన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ సాకా శ్రీనివాస్, జెడ్పీటీసీ పుట్టపూడి అబ్బు, ఎంపీపీ మేడిశెట్టి సత్యవేణి, ఎంపీటీసీ సభ్యులు గొల్లపల్లి సోనియా, శీలం భాస్కరరావు, ఉపాధ్యక్షుడు బొక్కా రాంబాబు, వైఎస్సార్ సీపీ గ్రామ అధ్యక్షుడు కట్టా మురళి, ఎంపీహెచ్ఈఓ జుత్తుక మల్లికార్జునుడు, హెచ్ఈ బి.రామారావు, వైద్య ఆరోగ్య కార్యకర్తలు, సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.



కపిలేశ్వరపురంలో కంటి పరీక్షలను పరిశీలిస్తున్న శిబిరం పరిశీలనాధికారి, జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి బీవీవీ సత్యనారాయణ

గృహ నిర్మాణాలు వేగవంతం చేయాలి

సోమేశ్వరం జగనన్న కాలనీని సందర్శించిన కలెక్టర్ శుక్లా

రాయవరం: వైఎస్సార్ జగనన్న కాలనీల్లో గృహ నిర్మాణ పనులను వేగవంతం చేయాలని జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్లా అధికారులకు సూచించారు. రాయవరం మండలం సోమేశ్వరంలోని జగనన్న కాలనీని ఆయన మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. నవరత్నాలు–పేదలందరికీ ఇళ్లు పథకంలో భాగంగా సామూహిక గృహ ప్రవేశాలు త్వరలో నిర్వహించేందుకు రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. ఈ నేపథ్యంలో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాలో సోమేశ్వరం జగనన్న కాలనీని ప్రారంభోత్సవానికి ఎంపిక చేశారు. ఈ నేపథ్యంలో కాలనీల్లో పనుల నిర్వహణను క్షేత్ర స్థాయిలో స్వయంగా పరిశీలించేందుకు ఆయన తనిఖీ చేశారు. ప్రస్తుతం జరుగుతున్న పనుల ప్రగతిని హౌసింగ్ పీడీ చల్లా బాబూరావు వివరించారు. అనుకున్న సమయానికి లక్ష్యానికి అనుగుణంగా ఇళ్ల నిర్మాణాలు, కాలనీల్లో మౌళిక సదుపాయాల కల్పన వేగవంతం చేయాలని కలెక్టర్ హిమాన్షు శుక్లా ఆదేశించారు. కలెక్టర్ పర్యటనలో సర్పంచ్ ఆరిఫ్, ఎంపీపీ నౌడు వెంకటరమణ, రామచంద్రపురం ఆర్డీవో సింధూ సుబ్రహ్మణ్యం, మండల ప్రత్యేకాధికారి శివశంకర ప్రసాద్, హౌసింగ్ ఈఈ మల్లికార్జునరావు, డీఈఈ రఘురామ్‌కుమార్, ఏఈ కొవ్వూరి శ్రీనివాసరెడ్డి, పీఆర్ డీఈఈ రామనారాయణ, తహసీల్దారు కేజే ప్రకాష్‌బాబు, ఎంపీడీవో కొవ్వూరి నరేంద్రరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



సోమేశ్వరంలోని జగనన్న కాలనీని తనిఖీ చేస్తున్న జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్లా

తాగునీటి సరఫరాపై ప్రత్యేక శ్రద్ధ

ఆలమూరు: రక్షిత తాగునీటిపై ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ వహిస్తూ ప్రతి ఇంటికీ కుళాయిని ఏర్పాటు చేస్తుందని కొత్తపేట ఎమ్మెల్యే చిర్ల జగ్గిరెడ్డి అన్నారు. మండలంలోని చెముడులంక రూ.37.7 లక్షలతో నిర్మించనున్న వాటర్ ట్యాంక్‌కు మంగళవారం ఆయన భూమి పూజ చేశారు. సర్పంచ్ తమ్మన శ్రీనివాసు అధ్యక్షతన ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ వైఎస్సార్ సీపీ అధికారంలోకి వచ్చిన తరువాత నియోజకవర్గ వ్యాప్తంగా రూ.26.2 కోట్లతో జల్‌జీవన్ మిషన్ కింద అనేక వాటర్ ట్యాంకులు నిర్మించి పైప్‌లైన్లను ఏర్పాటు చేశామన్నారు. ఇప్పటికే రూ.కోట్ల వ్యయంతో గ్రామంలో ఎంతో కాలంగా ఉన్న ప్రధాన మేజర్ డ్రైన్ నిర్మించుకోవడం జరిగిందన్నారు. అలాగే రికార్డు స్థాయిలో సీసీ రోడ్లు, గ్రామ సచివాలయాలు, ఆర్బీకే, తదితర భవనాలు నిర్మిస్తున్నామన్నారు. గ్రామంలోని సుమారు 1200 కుటుంబాలకు రూ.54 లక్షలతో ఇంటింటికీ పైప్‌లైన్ వేసి కుళాయిల ద్వారా తాగునీటిని అందించేందుకు టెండర్ల ప్రక్రియను ప్రారంభించామని ఎమ్మెల్యే పేర్కొన్నారు.

పేదల అభ్యున్నతే లక్ష్యంగా పాలన

- ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు
- 10వ వార్డులో గడప గడపకూ మన ప్రభుత్వం



స్థానికులతో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు

మండపేట: పేదల అభ్యున్నతి లక్ష్యంగా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలన సాగిస్తున్నారని ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు అన్నారు. గడపగడపకూ మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా మున్సిపల్ చైర్‌పర్సన్ పతివాడ దుర్గారాణి, పార్టీ జగ్గంపేట నియోజకవర్గ పరిశీలకుడు వేగుళ్ల పట్టాభిరామయ్యచౌదరి, రైతు విభాగం రాష్ట్ర కార్యదర్శి రెడ్డి రాజుబాబు, ఏఎంసీ చైర్మన్ సిరిపురపు శ్రీనివాసరావు తదితరులతో కలిసి మంగళవారం స్థానిక 10వ వార్డులో పర్యటించారు. ఇంటింటికీ వెళ్లి స్థానికులతో మమేకమయ్యారు. నాలుగేళ్ల పాలనలో ప్రభుత్వం ద్వారా వారికి చేకూరిన లబ్ధిని వివరిస్తూ వారి అవసరాలను అడిగి తెలుసుకున్నారు. స్థానికులు ఆయన దృష్టికి తెచ్చిన సమస్యలను అక్కడికక్కడే మున్సిపల్ అధికారులతో మాట్లాడి పరిష్కారానికి చర్యలు తీసుకున్నారు. అనంతరం ఎమ్మెల్సీ తోట మీడియాతో మాట్లాడుతూ క్షేత్రస్థాయిలో పథకాల అమలును ప్రత్యక్షంగా పరిశీలించడంతో పాటు ప్రజల అవసరాలను గుర్తించి వాటిని పరిష్కరించేందుకు గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం దోహదం చేస్తుందన్నారు. ప్రభుత్వ పనితీరు పట్ల పట్ల ప్రజలు పూర్తి సంతృప్తిని వ్యక్తం చేస్తూ సీఎం జగన్‌ను ఆశీర్వదిస్తున్నారని ఎమ్మెల్సీ తోట పేర్కొన్నారు.

ఎమ్మెల్సీ తోటకు ఘన స్వాగతం

10వ వార్డులో ఎమ్మెల్సీ తోటకు ఘన స్వాగతం లభించింది. వార్డు ఇన్‌చార్జి కొప్పిరెడ్డి పద్మావతి, సాధనాల శివభగవాన్ ఆధ్వర్యంలో పార్టీ స్థానికులు ఆయనకు ఘనంగా స్వాగతం పలికారు. మున్సిపల్ వైస్ చైర్మన్ పిల్లి గణేశ్వరరావు, విప్ పోతంశెట్టి ప్రసాద్, అర్బన్ కన్వీనర్ ముమ్మిడివరపు బాపిరాజు, పార్టీ మహిళ నేత ఓగిరాల దేవి, శెట్టిబలిజ సంఘం అధ్యక్షుడు పంపన శ్రీనివాస్, కార్పొరేషన్ డైరెక్టర్ షేక్ ఆలీఖాన్‌బాబా, సొసైటీ చైర్మన్ పెంకే గంగాధర్, పార్టీ నాయకులు కొవ్వాడ అప్పన్నబాబు, సూరంపూడి సత్యప్రసాద్, పాలంగి కమల, పొలమాల ఆనందబాబు, కోళ్ల అయ్యప్ప తదితరులు పాల్గొన్నారు.

గుర్తు తెలియని వ్యక్తి దాడి చేశాడని ఫిర్యాదు

మండపేట: పట్టణంలోని సూర్యగ్రాండ్ లాడ్జి పక్క వీధిలో దాడి ఘటనపై కేసు నమోదు చేసినట్టు పట్టణ పోలీసులు తెలిపారు. రాయవరం మండలం లొల్లకు చెందిన గుత్తుల అప్పారావు మండపేటలో భవన నిర్మాణ కార్మికుడిగా పని చేసుకుంటూ ఇక్కడే ఆలయాల వద్ద పడుకుంటాడు. 28వ తేదీ రాత్రి తాను మద్యం తాగి లాడ్జి పక్కన గల బార్ ఎదురుగా బూతులు తిట్టుకుంటుండగా గుర్తు తెలియని వ్యక్తి దాడి చేసినట్టు అప్పారావు ఫిర్యాదు చేసినట్టు మంగళవారం పోలీసులు తెలిపారు.

రాజకీయ దురుద్దేశంతోనే ఆరోపణలు

కాజులూరు: సీఎం జగనన్న అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, వాటి ద్వారా స్థానిక నాయకులుగా తమకు వస్తున్న ప్రజాదరణ చూసి ఓర్వలేక ప్రతిపక్ష నాయకులు తమపై బురద చల్లేందుకు చూస్తున్నారని కోలంక పీఏసీఎస్ చైర్మన్ తాగరు శేఖర్‌బాబు అన్నారు. మంగళవారం కోలంకలో ఆయన మాట్లాడుతూ గ్రామంలో రెండేళ్ల క్రితం రెండెకరాల భూమి కొనుగోలు చేశామన్నారు. ఇటీవల బందనపూడికి చెందిన దేగల ఉమారత్నవాణి కుటుంబీకులు కొంత భూమి కొనుగోలు చేసి తమ స్థలానికి వచ్చే రహదారి మార్గాన్ని కలుపుకుంటూ గోడ నిర్మించేందుకు ప్రయత్నించారన్నారు. తాము అడ్డుకునేందుకు ప్రయత్నించగా కిరాయి రౌడీలతో తమపై దాడి చేశారన్నారు. గాయాలపాలైన తాను రామచంద్రపురం ప్రభుత్వాసుపత్రికి వెళ్లి చికిత్స చేయించుకున్నానన్నారు. ఆసుపత్రి నుంచి వచ్చిన ఎమ్మెల్సీ రిపోర్టు ఆధారంగా గొల్లపాలెం పోలీసులు గ్రామంలో విచారణ నిర్వహించి కేసు నమోదు చేశారన్నారు. నెల రోజులు గడచిన తర్వాత రెండు రోజుల క్రితం దేగల ఉమారత్నవాణి కుటుంబీకులు గొల్లపాలెం పోలీస్‌స్టేషన్ వద్ద అర్థం పర్థం లేని ఆరోపణలు చేస్తూ తమపై కేసు నమోదు చేయాలంటూ ఆందోళన చేశారన్నారు. తాము కొన్న భూమికి రహదారి మార్గంతో సహా దస్తావేజులు ఉన్నాయని, రాజకీయ దురుద్దేశంతో సరిహద్దు వివాదానికి పార్టీల రంగు పులమడం దారుణమన్నారు.

రైతులకు 'సహకార'మందిస్తూ..

- వినూత్న రీతిలో వ్యాపారం
- ప్రత్యేకతను చాటుకుంటున్న వల్లూరు పీఏసీఎస్
- ఉమ్మడి జిల్లాలో ద్వితీయ స్థానంలో విశిష్ట అవార్డు అందుకున్న చరిత్ర

కపిలేశ్వరపురం: రైతులకు సేవలందించడంతో పాటు తనకాళ్లపై తాను నిలబడడం వల్లూరులోని శ్రీ సత్యనారాయణ ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం లిమిటెడ్ ప్రత్యేకత. వ్యవసాయ సహకార సంఘంగా సాధారణ కార్యకలాపాలకే పరిమితం కాకుండా విభిన్న మార్గాలను అనుసరిస్తూ లాభాల బాటలో పయనిస్తూ ఆదర్శంగా నిలుస్తోంది. సహకార సంఘం ప్రత్యేకతను గుర్తించిన ప్రభుత్వం ఆప్కాబ్ వజ్రోత్సవాల సందర్భంగా ఈ ఏడాది ఆగస్టు 4న సహకార సంఘానికి విశిష్ట అవార్డును అందజేసింది. సంఘం కార్యకలాపాలు ప్రాంతాలకు అతీతంగా అనుభవాలను పంచుతున్న నేపథ్యంలో ఈ కథనం..

ఏడాదిలో లావాదేవీలిలా..

సహకార సంఘం సభ్యుల నుంచి రూ.4,88,24,000 విలువైన ఫిక్సిడ్ డిపాజిట్లను సేకరించింది. 2022–23 ఆర్థిక సంవత్సరంలో రూ.36,16,716 లాభాన్ని ఆర్జించింది. సంఘ సభ్యులకు రూ.3,81,20,300 విలువైన స్వల్పకాలిక రుణాలను అందించింది. రూ.2,34,474 డీసీసీబీ బ్యాంకు ద్వారా దీర్ఘకాలిక రుణాలు, సంఘం సొంత నిధులు నుంచి రూ.3,87,94,123 దీర్ఘకాలిక రుణాలనందించింది. రూ.86,24,987 బంగారు రుణాలు, రూ.18,49,723 ఎరువులపై రుణాలు, రూ.20,38,100 ఫిక్సిడ్ డిపాజిట్లపై రుణాలు, రూ.4,82,583 ఉద్యోగస్తులకు పే స్కేల్‌పై ఇచ్చే ఎంటీ రుణాలు, రూ.5,00,000, ఎస్టీ రుణాలు, రూ.81,008 సూపర్ బజార్ ద్వారా అరువు రుణాలు అందించింది.

సంఘం పటిష్టమైనదిలా...

1953 ఫిబ్రవరి 3న స్థాపించిన సహకార సంఘం 1953 మార్చి 2 నుంచి కార్యకలాపాలను స్థాపించింది. అప్పటి నుంచి అంచలంచెలుగా అభివృద్ధి చెందుతూ ఇప్పటికి 1,358 మంది సభ్యులకు చేరింది. సభ్యుల షేరు ధనం విలువ రూ.78,43,006తో రూ.13,53,49,302 టర్నోవర్ వ్యాపారం చేస్తుంది. రూ.ఐదు కోట్లకు పైబడి పంట రుణాలనందిస్తోంది. రూ.3,50 కోట్లు దీర్ఘకాలిక రుణాలనందించింది. సూపర్ మార్కెట్ నిర్వహణ ద్వారా ఆర్థిక వనరులను సమకూర్చుకుంది. శక్తి సహాయక పథకం ద్వారా మరణించిన సంఘ సభ్యుని కుటుంబానికి రూ.10వేలు ఆర్థిక సాయాన్నందిస్తుంది. దీర్ఘకాలంగా సొసైటీ పాలకవర్గాలు, సీఈఓ ముత్యాల వెంకట్రావు, సిబ్బందిల కృషి, రైతుల సహకారం ఫలితంగా వల్లూరు, నేలటూరు, నిడసనమెట్ట గ్రామాల ఆయకట్టు రైతులకు ఎంతో మేలు కలుగుతుంది.



వల్లూరు సహకార సంఘం సూపర్ మార్కెట్‌లో సరుకు కొనుగోలు చేస్తున్న కస్టమర్లు



విజయవాడలో మంత్రి గోవర్ధన్ చేతుల మీదుగా అవార్డు అందుకుంటున్న చైర్మన్, సీఈఓలు (ఫైల్)

సంఘం అభివృద్ధి ఇలా..

వ్యవస్థాపక అధ్యక్షులుగా ముత్యాల సత్యనారాయణ (అబ్బాయి) 1953 మార్చి 2 నుంచి 1965 జూలై 14 వరకూ పనిచేశారు. నూనె వీర్రాజు సహకార సంఘం భవన నిర్మాణానికి స్థలాన్ని దానం చేశారు. 2003 మే 2న వేగుళ్ల లీలాకృష్ణ సంఘం చైర్మన్‌గా ఉండగా వేగుళ్ళ వీర్రాజు పేరున నూతన కార్యాలయ భవనాన్ని ప్రారంభించారు. సంఘం అధ్యక్షులుగా పుట్టా సత్యనారాయణ ఉన్న 2007 ఫిబ్రవరిలో సమావేశ హాల్‌ను నిర్మించుకున్నారు. 2012లో రూ.50వేలతో కంప్యూటర్లను ఏర్పాటు చేసుకుని లావాదేవీలకు సాంకేతికతను వినియోగించనారంభించారు. 2018 మార్చిలో వేగుళ్ల వీరవెంకట సత్యనారాయణమూర్తి హయాంలో రూ.4,52,149 తో గోదాముకు రేకుల షెడ్డు, రూ.3,30,189 స్ట్రాంగ్ రూమ్‌ని నిర్మించి మరో రూ.4,45,000తో ఆధునీకరించారు. రూ.2,55,000తో సేఫ్ వాకర్లను నిర్మించారు. వే బ్రిడ్జిని నిర్మించారు. త్రిసభ్య కమిటీ చైర్మన్‌గా కుక్కల వీరన్న హయాంలో సూపర్ మార్కెట్‌ను ఏర్పాటు చేశారు. తర్వాత కాలం నుంచి చైర్మన్‌గా ఉన్న ముత్యాల సతీష్ కుమార్ సంఘాన్ని అభివృద్ధి పథాన ముందుకు నడిపిస్తున్నారు.

రైతుల అభ్యున్నతే సంఘం లక్ష్యం



సహకార సంఘం చేపట్టిన కార్యకలాపాలన్నీ రైతులకెంతో మేలు చేస్తున్నాయి. వారి అభ్యున్నతే సంఘం ప్రధాన లక్ష్యం. ప్రైవేటు అప్పులకు వెళ్ళకుండా చేదోడు వాదోడుగా సహకార సంఘం నిలుస్తుంది. సూపర్ మార్కెట్ ద్వారా సరసమైన ధరలకు నిత్యావసర సరుకులు లభ్యమవుతున్నాయి.

– ముత్యాల సతీష్ కుమార్, చైర్మన్, పీఏసీఎస్, వల్లూరు

వ్యాపారాభివృద్ధి ఇలా...

ప్రభుత్వ నిబంధనలు మేరకు రైతులకు ఎరువులను విక్రయిస్తుంది. ఫిక్సిడ్ డిపాజిట్లు, సేవింగ్ ఖాతాలను నిర్వహిస్తుంది. ఫిక్సిడ్ డిపాజిట్లపై తిరిగి 85 శాతం మొత్తాన్ని ఖాతాదారుడు రుణంగా పొందే సదుపాయాన్ని సంఘం కల్పిస్తుంది. నెలకు, మూడు, ఆరు, సంవత్సర కాల పరిధిలో ఫిక్సిడ్ డిపాజిట్లు తాలూకు వడ్డీని పొందవచ్చు. సంవత్సరానికి రూ.1500 అద్దె ప్రాతిపదికన లాకర్ల సదుపాయం ఉంది. బంగారు ఆభరణాలపై రూ.10 లక్షలు వరకూ రుణాలను ఇస్తున్నారు. సొంత భూమి హామీ మేరకు ఎరువులను వడ్డీ మేరకు అరువు ఇస్తున్నారు. భూమి అభివృద్ధి, పాడి పశువులు, వరికోత మిషన్లు, మోటారు సైకిళ్ళు, ట్రాక్టరు కొనుగోలుకు దీర్ఘకాలిక రుణాలనందిస్తుంది.

కంటి ఆరోగ్యం ప్రధానం

కపిలేశ్వరపురం: విశ్వంలో అత్యంత ప్రధానమైన కంటిని పరిరక్షించుకోవాల్సిన అవసరాన్ని గుర్తించాలని వాకతిప్ప పీఏసీఎస్ చైర్మన్ మేడిశెట్టి గోవిందు అన్నారు. నాగుల చెరువు గ్రామంలోని అంగన్‌వాడీ సెంటర్ ఆవరణలో మంగళవారం ఉచిత కంటి పరీక్షా శిబిరాన్ని నిర్వహించారు. కడియం మండలం దుళ్ళ గ్రామానికి చెందిన జై ప్రాథమిక కంటి ఆసుపత్రి సహకారంతో నిర్వహించిన శిబిరంలో డా.సుశీల గ్రేస్, కుమార్ వైద్యసేవలందించారు. శిబిరాన్ని ఏర్పాటు చేయడం పట్ల గ్రామస్తులు కృతజ్ఞతలు తెలిపారు.